ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నీటి విడుదలపై అస్పష్టత!

ఖరీఫ్‌లో తప్పని జాప్యం - నైరుతి మందగించడంతో అయోమయంలో రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందస్తుగా ప్రారంభం అవుతుందని భావించిన అధికారుల అంచనాలు అన్ని తలకిందుల అయ్యాయి. మే నెలలో విస్తారంగా వర్షాలు కురవగా జూన్‌లో కనీస వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల ఇప్పటి వరకు సాగు ఊపందుకోలేదు. కృష్ణా డెల్టాలో ముందస్తు సాగు చేయాలని సిఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించలేదు. డెల్టాలో వరి సాగుకు ఈ ఏడాది వెదపద్ధతిలో ఎక్కువగా రైతులు పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేసినా ఇంత వరకు పట్టుమని 10 శాతం విస్తీర్ణంలో కూడా సాగు జరగలేదు. జిల్లాలో 1.53 లక్షల ఎకరాలోవరి సాగు జరుగుతుందని అంచనా ఉండగా ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లోనే సాగు చేశారు. అలాగే కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు నీటి విడుదల తేదీని కూడా ఖరారు చేయలేదు. నైరుతీ రుతు పవనాలు మందగించడంతో కనీస వర్షపాతం నమోదు కాలేదు. జూన్ నెలలో జిల్లాలో 97.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 51.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. అయితే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సన్నద్ధం చేసి వారికి తగిన సూచనలు చేసే విషయంలో ఉన్నతాధికారులు ఎవ్వరూ ఇంత వరకు జిల్లాకు రాలేదు. నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించలేదు. నీటి విడుదలకు సంబంధించి నీటి వినియోగంపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి సూచనలు జారీ చేయలేదు. కృష్ణా ఎగువన ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. జూరాల నుంచి శ్రీశైలంకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈనెలాఖరు కల్లా శ్రీశైలంకు గరిష్ట నీటి మట్టం తగ్గితే నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల పై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. వర్షాలు లేకపోవడం, సాగు నీటి కాల్వలకు నీటి విడుదలపై స్పష్టత రాకపోవడం వల్ల రైతులు ఇంకా పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాలేదు. పల్నాడు జిల్లాలో ఈనెలలో కనీస వర్షపాతం నమోదు కాలేదు. మొత్తం వర్షపాతంలో దాదాపు 60 శాతం వరకు లోటు కన్పిస్తుంది. దీంతో సహజంగానే పల్నాడులో సాగు జాప్యం జరుగుతుందని భావిస్తున్నా ఈ ఏడాది మిర్చి స్థానంలో ప్రత్తి ఎక్కువగా సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పత్తిసాగుకు ఇదే అనువైన సమయం అయినా వర్షాలు

2లో

అధికారం కోసం సిద్ధాంతాలకు తిలోదకాలు

నరేంద్రమోడీలో నియంతృత్వ పోకడలు

ఎమెర్జెనీ నాడు-నేడు అనే అంశంపై జిల్లా సదస్సులో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

అధికారం కోసం ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలు పలుకుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. దేశంలో ఎమెర్జెన్సీ విధించి 50 ఏళ్ల అయిన సందర్భంగా ఎమెర్జెనీ నాడు-నేడు అనే అంశంపై గుంటూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన జిల్లా సదస్సులో ఆయన ప్రసంగించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నా రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి మద్దతును కొనసాగిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కేవలం అధికారం కోసం టిడిపి, వైసిపి నుంచి గెలిచిన ఎంపిలు బిజెపికి మద్ధతు ప్రకటిస్తున్నాయన్నారు. రాజ్యసభ సభ్యులు పదవికి రాజీనామా చేసి బిజెపికి సహకరిస్తున్నారని తెలిపారు. 1975లో బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్ధతు పలికి పరోక్షంగా ఎమర్జెన్సీని సమర్ధించాయన్నారు. అయితే సిపిఎం మాత్రమే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిందన్నారు. బి.జెపికి 2024లో సంపూర్ణ మెజార్టీ రాకపోయినా నితీష్‌కుమార్, చంద్రబాబు

2లో

పల్నాడు జిల్లా నరసరావుపేటలో సిపిఎం నిరసనలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

గుంటూరులో ర్యాలీలో అభివాదం చేస్తున్న వై ఎస్ షర్మిల

ఆశించిన పాలన ఏదీ?

చంద్రబాబుకు పిసిసి అధ్యక్షురాలు షర్మిల ప్రశ్న

గుంటూరులో కాంగ్రెస్ కార్యకర్తలతో భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం లేదని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. గుంటూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు చిలకా విజయ కుమార్ అధ్యక్షత వహించారు. చంద్రబాబుది మంచి ప్రభుత్వం కాదని, ఓట్లేసినందుకు ముంచారని ఎద్దేవా చేశారు. ముంచిన వాళ్ళు మంచి చెప్పడం అంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్టే ఉందన్నారు. సూపర్ సిక్స్ ఇవ్వనందుకు మంచి చేశారా? రూ. 17 వేల కోట్ల విద్యుత్ బిల్లుల భారం మోపినందుకు మంచి చేశారా ? గత ప్రభుత్వం లెక్క మీరు కూడా అప్పులు చేస్తున్నందుకు మంచి అనాలా? ప్రశ్నించారు. ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీలకు 50 ఏళ్ల దాటితే పింఛన్లు ఇస్తామన్నారు. ఇంత వరకు కొత్త ఫించన్లు ఇవ్వడం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వడంలో

2లో

గుంటూరులో మీడియాతో మాట్లాడుతున్న ఎల్ ఎస్ భారవి

బ్రిడ్జిపై మొండి వైఖరి సరికాదు

ముందుచూపు లేకుండానే శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం - బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన జెఎసి

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా మొండిగా ముందుకు వెళ్లటం సరికాదని, నిర్మాణానికి ముందుగా తీసుకోవాల్సిన చర్యలు ఏవీ తీసుకోకుండా బెటర్ శంకర్‌విలాస్ ఫ్లై ఓవర్ జెఎసి నాయకులు ఎల్.ఎస్.భారవి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారవి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జెఎసి ఆధ్వర్యంలో ఫ్లైఓవర్‌కు సంబంధించి పలు సవరణలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. రూరల్ ప్రాంతానికి ఉద్దేశించిన సేతుబంధన్ స్కీమ్‌లో మంజూరైన ఈ బ్రిడ్జిని అధికంగా ట్రాఫిక్ ఉండే గుంటూరులో మంజూరు చేయించే నిర్మాణానికి పూనుకోవటం సరికాదన్నారు. డిజైన్ మార్పుపై హైకోర్టులో దాఖలైన రిట్‌కు ఆర్అండ్‌బి వారు రాబోయే 10ఏళ్ల ట్రాఫిక్‌ను మాత్రమే దృష్టిలో ఉంచుకొని నిర్మాణం చేస్తున్నట్లు రాతపూర్వకంగా చెప్పారన్నారు. అంటే పదేళ్ల తర్వాత ట్రాఫిక్ పెరిగితే మళ్లీ కొత్త బ్రిడ్జి కడతారా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి దూరదృష్టి లేదన్నారు. రాబోయే 70 ఏళ్లకు

2లో

ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

నేడు, రేపు గుంటూరులో సిఎం పర్యటన

వాక్‌థాన్ ర్యాలీలో నేరుగా పాల్గొనున్న చంద్రబాబు

ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి, అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భముగా గురువారం గుంటూరులో జరిగే 'వాక్ థాన్' ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన నున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. హోం మంత్రి వంగలపూడి వనిత మాట్లాడుతూ రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహిత తీర్చేదిద్దటానికి ఈగల్ ను స్థాపించి గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ఉక్కుపాదం మోపడంతో పాటు, డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నారని అనిత తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి శ్రీ

2లో

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

28న మానవ హక్కుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

తెనాలిలో ఈనెల 28న జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు జి.లూదర్‌పాల్ పిలుపునిచ్చారు. బుధవారం 41 వ డివిజన్ సుందరయ్య నగర్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా కెవిపీఎస్ లూథర్‌పాల్, ఆది నికల్సన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ తెనాలిలో మానవ హక్కులు ఉల్లంఘిస్తూ పోలీసుల చేతిలోకి రాజ్యాంగాన్ని తీసుకోవటం నిరసిస్తూ జరిగే సదస్సులో ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్‌వలి, కాసిం వలి, నాయుడు పద్మ, ఉస్నమా పాల్గొన్నారు.

ప్రజలు ఆశించిన పాలన ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం విఫలం అయిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద దాదాపు 30 లక్షల మంది రైతులను ముంచే ప్రయత్నం చేశారన్నారు. తల్లికి వందనం కింద 20 లక్షల మంది బిడ్డలను మోసం చేశారన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు పలువురికి అందడం లేదన్నారు. ఉచిత బస్సు పథకం ఊసే లేదన్నారు. మహాశక్తి పథకం కింద మహిళలను మోసం చేశారన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. నిరుద్యోగ భతి ఇస్తామని మోసం చేశారని, 20 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని ఫీజు రీయింబర్స్ ఇవ్వకుండా బకాయిలు పెట్టారన్నారు. మీది మంచి ప్రభుత్వం కాదు..ముంచే ప్రభుత్వం అన్నారు. సింగయ్య మృతి జగన్ నిర్లక్ష్యంతో పాటు పోలీసుల వైఫల్యమేనని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, మస్తాన్ వలి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకవర్మ కుమార్, గడ్డం పాల్ విజయ్ కుమార్, మోహన్ రాచకొండ జాన్ బాబు, బిళ్ళా సునీల్, చందు సాంబశివుడు, షేక్ సలీం, గాదే నాగేశ్వరరావుకట్ట జోహార్ బాబు, ఎం.ఎ.కరీం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బాపట్ల జిల్లా నుంచి గుంటూరు వచ్చే ముందు భారీ ర్యాలీతో కాంగ్రెస్ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా పార్టీ కార్యాలయానికి తోడ్కొని తీసుకువచ్చారు.

జగన్ బల ప్రదర్శనలు నిషేధించాలి

రాష్ట్రంలో మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పరామర్శల పేరుతో నిర్వహిస్తున్న జగన్ బల ప్రదర్శనలు నిషేధించాలని పి.సి.సి. అధ్యక్షురాలు వైయస్ షర్మిల డిమాండ్ చేశారు. గుంటూరు లోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ ప్రతి సారి బలప్రదర్శనలు చేస్తున్నా పోలీస్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆమె ఆరోపించారు. సత్తనపల్లి పర్యటనకు అనుమతి లేదని, ఆంక్షలు ఉన్నాయని ప్రకటించిన పోలీసు అధికారులు తాడేపల్లిలో 50 వాహనాలతో జగన్ బయలుదేరితే ఎందుకు అడ్డుకోలేదన్నారు. జగన్ పర్యటనలో జరిగిన ఘటనలకు పోలీస్ శాఖ వైఫల్యం ఉందన్నారు. కాంగ్రెస్ తో సహా ఇతర పార్టీల వాళ్లు ఏదైనా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తే వెంటనే హౌస్ అరెస్టులు చేసే పోలీసు అధికారులు జగన్‌తో పాటు వైసిపి నాయకుల విషయంలో ఎందుకు చేయటం లేద న్నారు. పోలీస్ అధికారులను కూడా జగన్ మేనేజ్ చేస్తున్నారని, డబ్బులు ఇచ్చి తన వైపుకు తిప్పుకుంటున్నారని ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ పై వ్యతిరేకతతో ప్రజలు చంద్ర బాబు నాయుడుని గెలిపిస్తే ఆయన ఇచ్చిన హామీల అమలు చేయటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో అసంతప్తి పెరుగుతుందన్నారు. చంద్ర బాబు కూడా మమ్మల్ని ముంచి నట్టు జనం భావిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయకుండా ఏడాదిలో రూ. లక్ష 50 వేల కోట్లు అప్పు చేశారన్నారు. కేంద్రంలో బిజెపికి కూటమి పార్టీలతో పాటు జగన్ కూడా మద్ధతు ఇస్తున్నారని అందువల్లే రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదన్నారు.

అధికారం కోసం సిద్ధాంతాలకు తిలోదకాలు

(మొదటి పేజీ తరువాయి)

మద్ధతుగా నిలవడం వల్లే కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మనగడ సాధిస్తుందన్నారు. మెజార్టీ లేకపోయినా మోడీలో నియంతృత్వ ధోరణి పోలేదన్నారు. ఎమర్జెన్సీ నుంచి ప్రధాన రాజకీయ పార్టీలు గుణపాఠం నేర్చుకోలేదన్నారు. అధికారంలో ఉన్న వారు నిరంకుశ విధానాలు విడనాడాలన్నారు. తమ హక్కుల కోసం పోరాడే ప్రజలకు స్వేచ్ఛ ఉండాలన్నారు. ప్రశ్నించే వారిని అణచి వేయాలన్న ధోరణి వల్లే చాలా మంది నేతలు ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా స్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలకమని కానీ టిడిపి ప్రభుత్వం పోలీసులకు అపరమితమైన అధికారాలు ఉండకూడదని తప్పు చేసిన వారికి న్యాయస్థానంలో శిక్షపడాలన్నారు. ఈ సందర్భంగా తెనాలిలో జరిగిన ఘటనలో పోలీసుల తీరును ఆయన తప్పుపట్టారు. తప్పు చేస్తే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చకుండా నేరుగా పోలీసులు ఎలా శిక్షిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ ఎమర్జెన్సీ కాలంలో సంజయ్‌గాంధీ దురాగతాల వల్ల ఎంతో మంది నష్టపోయారన్నారు. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారన్నారు. ఎమర్జెన్సీ తరువాత దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలవగా ఉత్తరాది రాష్ట్రాలలో జనాతా పార్టీ ఓడిపోయిం దన్నారు. 2014 నుంచి దేశంలో కూడా అప్రకటిత అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దేశంలో స్వతంత్ర సంస్థలు ఎన్నికల కమిషన్, యూపిఎస్‌సిని కూడా ఎన్‌డిఏ ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుందన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి ప్రసంగిస్తూ మందడం గ్రామంలో తాగునీటి కోసం దళితులు ఆందోళన చేస్తే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తాగునీటి కోసమే అగ్రకులాల వారుధర్నా చేస్తే పోలీసులు చూసిచూడనట్టు వ్యవహరించారన్నారు. ఎమర్జెన్సీ కాలంలోని పాలకుల పోకడలు ప్రస్తుత పాలకులు కూడా అవలంభిస్తున్నారని ధ్వజమెత్తారు. నగర కార్యదర్శి కె.నళీనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మోడీకి నచ్చితే జోడి కడతారని నచ్చకపోతే ఈడి, సిబిఐలను ప్రయోగించి కక్ష, కుట్ర పూరిత రాజకీయాలు చేస్తారని సిపిఎం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. నాడు కాంగ్రెస్ ప్రకటించిన ఎమర్జన్సీపై మోడీ వ్యాఖ్యలకు నిరసనగా నరసరావుపేట పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఎం చేపట్టిన నిరసనను ఉద్దేశించి విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ 11 ఏళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తుందని విమర్శించారు. 1974 - 77 మధ్య అప్పటి కాంగ్రెస్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజాస్వామ్య హక్కులను కాల రాసిందని మీడియాలో స్వేచ్ఛగా వార్తలు రాయకుండా చేసి ప్రశ్నించిన వారిని జైలుకు పంపించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. అటువంటి ఎమర్జెన్సీ పాలన ఎత్తి వేయించి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ప్రజలు ఏర్పాటు చేసుకున్నారని కానీ నేడు మోడీ నాటి కాంగ్రెస్ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తున్నానని చెబుతూనే 11 ఏళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్నారన్నారు. నాటి కాంగ్రెస్ ఎమర్జెన్సీ వలన

గుంటూరులో సభకు హాజరైన సిపిఎం అభిమానులు, నాయకులు

కలిగే నష్టాలను పత్రికలు స్వేచ్ఛగా ప్రజలకు వివరించాయని కానీ నేడు మీడియా మొత్తం మోడీ కనుసన్నల్లో నడుస్తున్నాయని మోడీని ప్రశ్నించే ధైర్యం ఏ మీడియా చేయడం లేదని కార్పొరేట్ శక్తులే అగ్ర బాగాన ఉండి మీడియాను నడిపిస్తున్నాయన్నారు. కుల్బర్గ్ హత్యలు, పుర్కాయస్థ అరెస్టులు, ప్రశ్నించిన వారిపై ఎస్మా ప్రయోగం, ఎటువంటి నిబంధనలు లేకుండా నెలలు తరబడి జైల్లో ఉంచడం పరిపాటిగా మారిందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ నాడు ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పు వెలువరిస్తే అప్పటి సీనియర్ నేత బాబు జగజ్జీవన్ రామ్ తనను ప్రధానిగా చేయాలని ముందుకు వస్తే హౌస్ అరెస్ట్ చేశారని ఆయనకు కు మద్దతు తెలిపిన పల్నాడు నేత కాసు బ్రహ్మానంద రెడ్డిని సైతం హౌస్ అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. అక్రమ గృహ నిర్బంధాలను, అరెస్టులను నాడు పత్రికలు బలపరిచాయని దీంతో ఇందిరాగాంధీ రాష్ట్రపతితో సంతకం చేయించి ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. అప్పటి వరకు పత్రికలలో సంపాదకీయాల పేరిట ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేక వార్తలను, వ్యతిరేకంగా మాట్లాడిన వారిని మొత్తం లక్షన్నర మందికి పైగా రాజకీయ నాయకులను సైతం అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. సంజయ్ గాంధీ పంచ సూత్రాల కార్యక్రమం పేరిట బలవంతంగా అనేక మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించారని దీనిని ఎవరు ప్రశ్నించలేకపోవడం అది ఒక చీకటి రోజన్నారు. అనంతరం జరుగుతున్న ఎన్నికల్లో ఇంటెలిజెన్సీ వర్గాలు మొత్తం ఇందిరా గాంధీకి అనుకూలంగా సర్వేలు వెలువరించాయని కానీ జయప్రకాష్ నారాయణ నేతత్వంలో లెఫ్ట్ పార్టీలు వామపక్షాలు ఏకమై ఇందిరా గాంధీ ప్రభుత్వాన్ని కుల దోయడంలో సిపిఎం కీలకంగా వ్యవహరించిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, ఎస్ ఆంజనేయులు నాయక్, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు టి పెద్దిరాజు, డి. శివకుమారి, జి.మల్లిశ్వరి, బండ్ల మహేష్, పెండ్యాల మహేష్, గుంటుపల్లి బాలకష్ణ, బొంకూరు వెంకటేశ్వర్లు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని,డి. బోసు,ఆంజనేయులు, హరిపోతురాజు మహిళా నాయకులు కుమారి తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై అస్పష్టత!

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడం వల్ల రైతులు ఇంకా విత్తనాలు నాటేందుకు తటపటాయిస్తున్నారు. వర్షాలు పూర్తిగా కురిసిన తరువాత పత్తి,వరి, మిర్చి సాగు చేస్తారు. ముందస్తుగా జొన్న, మొక్కజొన్న, శనగ, మినుము, పెసర వేయాలని రైతులు యోచిస్తున్నారు. అయితే ఇప్పటికీ వర్షాలు పూర్తిగా కురవకపోవడం, రెండు రోజుల క్రితం వరకు వేడి గాలులు కొనసాగడం వల్ల రైతులు పంటలు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. జల్లులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది.

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతి

ప్రజాశక్తి తెనాలి

స్థానిక రైల్వే స్టేషన్లో బుకింగ్ కౌంటరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు 45 నుండి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి స్టేషన్‌లోని పడమర బుకింగ్ కౌంటరు క్యూ లైన్ వద్ద బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బుధవారం రాత్రి తెలిపారు.

మాదక ద్రవ్యాల వినియోగం హానికరం : ఎస్పి

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం పల్నాడు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధులలో మాదకద్రవ్యాలు మరియు గంజాయి వినియోగం వలన జరిగేటువంటి అనర్థాల గురించి అవగాహన కలిగిస్తూ పాఠశాల, కాలేజీలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమం ద్వారా యువతలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందించడమే ముఖ్య లక్ష్యం అని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికి, కుటుంబాలకు, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నుండి దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వాడకం మానవ మనుగడకు హానికరం అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి వారి సేవలను వినియోగించుకొననున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుత సమాజంలో యువత చాలా తేలికగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా తీర్చిదిద్దేందుకు కషిచేయాలని సూచించారు.

బ్రిడ్జిపై మొండి వైఖరి సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

సరిపోయే విధంగా నిర్మిచాల్సి ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రైల్వే గేటు ఓపెన్ చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీయే నివేదిక ఇచ్చిందన్నారు. దీనిని కూడా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ముందుగా ఆర్‌యుబి నిర్మించాలని కోరారు. నిధులు పెంచి, హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ సింగిల్ పిల్లర్‌తో ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. జెఎసి నాయకులు పి.వి.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ శంకర్‌విలాస్‌తో పాటు శివారు ప్రాంతంలోని పలు బ్రిడ్జిలు మంజూరు అయ్యాయని, వాటిని రాబోయే ఆరు నెలల్లో ప్రారంభిస్తామని చెబుతున్న కేంద్ర మంత్రి నిర్మాణం వల్ల ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం ద్వారా గుంటూరు చరిత్రలో ఒక అప్రతిష్టను ప్రభుత్వం మూటకట్టుకుంటుందన్నారు. భూసేకరణ పూర్తి కాకుండానే, హడావుడిగా నిర్మాణం చేపడుతున్నారని, ఆ తర్వాత నిర్మాణం ఆగితే ప్రజలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. మరో జెఎసి నాయకులు బెల్లంకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు కోర్టు ఆదేశాలను కూడా పాటించకుండా పనులు ప్రారంభించారన్నారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ప్రభావితం అవుతున్న యజమానులకు పరిహారం ఇవ్వాలని కోర్టు చెప్పినా పట్టించుకోకుండా పనులు ప్రారంభించారన్నారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు వల్లూరి సదాశివరావు, బ్రాడీపట, అరండల్‌పేట అసోసియేషన్ నాయకులు కార్తీక్, డెమోక్రటిక్ ఫోరం నాయకులు అవధానుల హరి పాల్గొన్నారు.

నేడు, రేపు గుంటూరులో సిఎం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

కన్వెన్షన్‌లో హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. తరువాత అమరావతి రోడ్డు లోని ఫీవర్ ఆసుపత్రి వద్ద వాక్ థాన్ ర్యాలీలో సిఎం పాల్గొంటారు. గోరంట్ల లోని చిల్లీస్ సెంటర్ వరకు ఆయన పాల్గొని తిరిగి సభా ప్రాంగణంకు చేరుకుంటారన్నారు. . గురువారం యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా నిర్వహించే అవగాహన ర్యాలీలోను, విద్యార్థులతో జరిగే ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. శుక్రవారం 27వ తేదీ ఆర్వీఆర్ జేసీ కళాశాలలో జరిగే ఏఐ హ్యాక్ థాన్ కార్యక్రమంలో కూడా సిఎం పాల్గొంటారని హోం మంత్రి తెలిపారు. రాష్ట్రంలో లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు , గంజాయి పంటను సాగు చేయకుండా కషి చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్లేలు గళ్ళా మాధవి, నశీర్ అహ్మద్, డిప్యూటీ మేయరు సజీలా, ఆర్డీవో కే.శ్రీనివాస రావు , తహసిల్దార్లు వెంకటేశ్వర్లు , సుభాని తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి - నిర్వాహకుల అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఇద్దరు విటులను, వ్యభిచార గఅహ నిర్వాహకులను అరెస్టు చేశారు. పట్టణ 3 టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ ఎస్ రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం మల్లెపాడు ద్వారకా నగర్‌లో నాలుగు అంతస్తుల భవనంలో మొదటి అంతస్తును బాపట్ల జిల్లా అమఅతలూరు మండలం పెదపూడికి చెందిన దాసరి సత్యనారాయణ, స్థానిక ముత్తెంశెట్టివారిపాలెంకు చెందిన మాదల దివ్య అద్దెకు తీసుకున్నారు. కొంతకాలంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నరసరావుపేట నుంచి ఓ మహిళను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశారు. పోలీసులు దాడి చేసిన సమయంలో వ్యభిచారం చేస్తున్న మహిళ మరో పురుషుడు పట్టుబడ్డారు. దీంతో విటులను, గృహ నిర్వాహకులు సత్యనారాయణ, దివ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 వేల నగదు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని, గతంలో కూడా 3 టౌన్ పరిధిలో వ్యభిచార నిర్వహణపై కొరడా ఝుళిపించినట్లు సీఐ చెప్పారు. దాడిలో సిబ్బంది కూడా సహకరించినట్లు చెప్పారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐ ఎస్.రమేష్ బాబు

పోలీసుల సంరక్షణలో బాలిక

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈ ఫోటోలో ఉన్న అమ్మాయి పేరు హంషిని అని చెబుతుంది. మిగతా వివరాలు ఏమి చెప్పలేక పోతుంది. ప్రస్తుతం ఈ బాలిక తాడేపల్లి పోలీస్ సంరక్షణలో ఉంది. వివరాలు తెలిసినవారు 8688831361 నెంబర్కు సంప్రదించాలని తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

తండ్రీకొడుకుల మరణం బాధించింది : ఎమ్మెల్యే జూలకంటి

లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మస్తాన్ వలి(70), ఆయన కుమారుడు షేక్ జాకీర్(35) లు అనారోగ్యంతో ఒకే రోజు సోమవారం నాడు మఅతి చెందారన్న వార్త తన మనసును ఎంతగానో కలచివేసిందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని సవేరా లాడ్జి వీధిలో నివాసం ఉంటున్న మస్తాన్ వలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జూలకంటి, ఆయన తనయుడు గౌతమ్ రెడ్డి, కూటమి పార్టీల పెద్దలు పరామర్శించారు. ఇంటి పెద్దను, ఎదిగిన కుమారుడిని ఒకే రోజు కొల్పవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం వారి కుటుంబానికి ఎమ్మెల్యే జూలకంటి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, టిడిపి నాయకులు కొమెరా దుర్గారావు, మద్దిగపు చినవెంకట్రామిరెడ్డి, మాచర్ల పట్టణ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మస్తాన్‌వలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మహత్యకు పాల్పడిన గోపి

జగన్ ఇంటి ముందు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నివాసం వద్ద బుధవారం పెట్రోల్ పోసుకుని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఆత్మహత్యాయత్నాన్ని నివారించి తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. తాడేపల్లి పోలీసులు విచారిస్తున్నారు. నందివెలుగుకు చెందిన ఆటో డ్రైవర్ తోట గోపిగా గుర్తించారు. తమ గ్రామంలో కూటమి నేతలు తమ కుటుంబాన్ని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కావాలని, మాజీ సీఎం కలవడానికి వచ్చానని, అందుకు వీలుపడకపోవడం తో వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు ముందు అంగీకరించారు. తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

గుంటూరుజిల్లా, గుంటూరుసిటీ, డోర్ నెం. 60-3-180రు పాత గుంటూరు కాపురస్తులు షేక్ మౌలాలి గారి కుమారుడు షేక్ సుభాని గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా... నా పేరిట గల గుంటూరు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 11452/2023రుగా, గుంటూరు సిటీ, నందివెలుగు రోడ్డు, కుమ్మరి బజారు, మసీదు ఎదురు రోడ్డులోని బాపతు డాక్యుమెంటు దాఖలా సర్వే నెం.191, 192రు నందలి 47-1/9 చదరపు గజముల ఆర్‌సిసి డాబాకు సంబంధించి సదరు దస్తావేజు, దానికి సంబంధించిన లింకు దస్తావేజు నెం. 5730/2013రును జిరాక్స్ నిమిత్తం తీసుకొని ఇంటి వద్ద నుండి సెంటర్‌కు జిరాక్సుల కోసం వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు లింకు డాక్యుమెంట్ ఎక్కడో జారిపడిపోయినది. ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
షేక్ సుభాని,
నందివెలుగు రోడ్డు, కుమ్మరి బజారు.
సెల్ నెం : 9703288979

వారధి రేలింగ్‌ను ఢీ కొన్న వాహనం - నదిలో పడిన ద్విచక్ర వాహనదారుడు

ప్రజాశక్తి- తాడేపల్లి

బుధవారం అర్ధరాత్రి కనకదుర్గ వారిపై గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళు_న్న భారీ ట్రాలీ వాహనం పైకెక్కి రైలింగ్ ను ఢీకొంది. క్యాబిన్ మొత్తం ట్రాలీ నుండి విడిపోయి రైలింగ్ మీద నిలబడి పోయింది. ట్రాలీ పక్కనే వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి వారధి పైనుండి వాహనంతో సహా కఅష్ణా నదిలో పడ్డాడు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తాడేపల్లి ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ వెంటనే స్పందించి నదిలోకి దిగి స్ట్రక్చర్ మీద గాయపడిన వ్యక్తి తాజ్ నీ నదిలోంచి బయటికి తీసి 108 అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది కూడా సహాయక చర్యలు పాల్గన్నారు. ప్రమాదం గురైంది భారీ ట్రాలీ వాహనం కావడంతో వారధిపై భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. మంగళగిరి డిఎస్పి మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు మరియు ఎస్ఐలు, సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో నదిలో పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఉత్తరప్రదేశ్‌కు చెందిన తాజ్‌గా తాడేపల్లి పోలీసులు ధ్రువీకరించారు. విజయవాడ మొగల్రాజపురం లో ఓ సెలూన్ లో పనిచేస్తున్నారు. ఓ పని మీద తాడేపల్లి వచ్చి తిరిగి విజయవాడ వెళుతున్న క్రమంలో ప్రమాదాన్ని గురయ్యా డు. తీవ్ర గాయాలైన తాజ్ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నోటీసు

మహారాజశ్రీ బాపట్ల, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A. No.63/2024 IN O.S. 144/12

ఉపద్రష్ట సత్యభామ (Died on 27-01-2016)
మరియు నలుగురు .....పిటీషనర్లు / వాదులు
ఎదిరి
శ్రీ మేకల వెంకటరావు మరియు ఇద్దరు
.... ప్రతివాదులు

టు
శ్రీ మేకల వెంకటరావు, S/o మేకల రామారావు, డోరు నెం. 1-11-1/1, 2వ వార్డు, పొన్నూరు మున్సిపాలిటి, పొన్నూరు 522 124, గుంటూరు జిల్లా.

పై కోర్టులో పై నంబరు పిటీషనులోని పిటీషనర్లు మీ మీద పై తెల్పిన శ్రీ కోర్టులో దాఖలు చేసియున్న O.S నెం. 144/2012 దావాను రెస్టోరు చేయుటలో కలిగిన ఆసల్యమును శ్రీ కోర్టు వారిని మన్నించి సదరు దావాను రెస్టొర చేయుటకు తమకు అవకాశం కల్గించమని పెట్టిన పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 2025 సం॥ జులై నెల 10వ తారీఖున ఉదయం 10.30 గం॥ లకు నేరుగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో హాజరై శ్రీ కోర్టు వారితో మనవి చేసుకొనవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షంలో విచారించి తీర్మానం చేయుదురని ఈ పబ్లికేషన్ ద్వారా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియచేయడమైనది.

వాయిదా తేది మరియు మీరు హాజరు కాబడవలసిన తేది : 10-07-2025 ఉదయం 10.30 గం॥లకు

రామప్రభు మాడభూషి,
బాపట్ల పిటీషనర్ల తరపు న్యాయవాది,
తేది: -06-2025 పొన్నూరు.
సెల్ నెం. 9849843562

మహారాజశ్రీ పిడుగురాళ్ల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గారి కోర్టులో

O.S. NO.149/2009.

Between
అన్నారపు రామకోటమ్మ .... వాది
Vs
దగ్గు తిరుపయ్య @ చిన్న రంగడు (Died)
మరియు ఇతరులు. ... ప్రతివాదులు

7వ ప్రతివాది కోపూరి దయమ్మ, W/o Late రామ స్వామి, హిందూ, aged about 52 years, R/o. స్వర్ణభారతి నగర్, గుంటూరు Town & District,.
8వ ప్రతివాది గాలి కుమారి W/o మరియాదాసు, aged about 35 years, R/o. స్వర్ణభారతి నగర్, గుంటూరు Town & District,.
9వ ప్రతివాది కొండా క్రీస్తు రాణి W/o కొండా రాజేష్, aged about 27 years, R/o. కొండపల్లి అడ్డ రోడ్, విజయవాడ, కృష్ణాజిల్లా.

పై నెంబర్ గల దావా లో 7వ ప్రతి వాది నుండి 9వ ప్రతివాదులకు పైకోర్టు వారి ద్వారా పంపిన దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టువారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారము ది. 07-07-2025 వ తేదీన ఉదయం 10-30 గం॥ లకు శ్రీ కోర్టువారి ఎదుట గాని న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(ఈ నోటీసు కోర్టు వారి ఆదేశాల మేరకు జారీ చేయబడినది)

వాయిదాతేది:07-07-2025

కావూరి జాలారావు
వాది తరపు న్యాయవాది
పిడుగురాళ్ల టౌన్. పల్నాడు జిల్లా
సెల్ నెం. 9989006559

ఎంపీ "కేశినేని"కి చర్మకారుల వినతి...

ప్రజాశక్తి మంగళగిరి

ఎంపీ కేసినేని శివనాథ్ కు వినతి పత్రం అందజేస్తున్న చర్మకార సంఘం నాయకులు

విజయవాడలో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో బుధవారం చర్మకారుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు, నాయకులు ఎంపీ శివనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బుల్లా మాట్లాడారు. ఎంపీ శివనాథ్ సానుకూలంగా స్పందించారని చర్మకారుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారన్నారు. గత నెలలో డాక్టరేట్ అవార్డు అందుకున్న తనను ఎంపీ సత్కరించారని ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.లిల్లీమ్మ పాల్గొన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam-530020.

Goverment Of India

FORM NO. I.T.C.P 17
(See rule 53 of the Second Schedule to the Income-tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No. 1162 of 2019 in OA No. 345 of 2018
Union Bank of India (e-Andhra Bank), Hindu College Branch, Guntur District.
Versus
M/s Hanuma Enterprises & another

To
(CD-1) M/s Hanuma Enterprises, Rep. by its Prop Sri. Y. Kanaka Mahalakshmi, W/o Sri.Venkateswarulu, D.No. 20-18-142, Sangadigunta, Guntur District-522003.
(CD-2) Sri. Venkateswarulu, S/o. Sri. Nagaiah, D.No. 20-18-142, Sangadigunta, Guntur District-522003.

Whereas in execution of Recovery Certificate dated **26.08.2021 in O.A No. 345/2018** for **Rs. 1,26,61,413/-** (Rupees one crore twenty six lakhs sixty one thousand four hundred and thirteen only) along with pendentallite and future interest **@ 11.55%** p.a compounded with quarterly rests from **14.02.2018** till realization / date of payment and the cost become due against you forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/ Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

It is ordered that you, the said Certificate Debtors, are hereby prohibited and restrained until further order of the undersigned, from transferring or charging the under mentioned properties in any way and that all persons be and that they are hereby prohibited from taking any benefit under such transfer or charge.

SCHEDULE "A" PROPERTIES

Item No. 1 (Property belongs to Smt. Y. Kanaka Mahalakshmi, covered under Document No. 4595/2014) Vacant site in an extent of 581.25 Sq.yrds bearing Plot No. 7, covered by D No. 72/2A of R.Agraharam, Guntur District and bounded by: **East:** Site belongs to others, **West:** Plot No.6, **North:** Site belongs to others, **South:** 30 Feet Road. **Item No. 2.** (Property belonging to Sri. Y. Venkateswarulu vide Document No. 8276/2002) Vacant site in an extent of 83 3/9 Sq.yrds covered by D.No. 1156, 1157 of Guntur and bounded by: **East:** 24 Feet Road, **West:** Land belongs to Manthri Sambasiva Rao, **North:** Property belongs to Y. Venkateswarulu, **South:** Land belongs to Manthri Narasimha Rao. **Item No. 3.** (Property belonging to Sri. Y. Venkateswarulu vide Document No.10109/2000) Vacant site in an extent of 206.6/9 Sq.yrds covered by D No. 1156, 1157, Guntur and bounded by: **East:** 24 Feet Road, **West:** Land belongs to Manthri Sambasiva Rao, **North:** Property belongs to Karnam Tirupathi Rao. **South:** Land belongs to Manthri Narasimha Rao.

(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the day 31st May 2025)

(Avasarala Anil) - Recovery Officer-I
Debts Recovery Tribunal, Visakhapatnam.

కలెక్టరేట్‌లోని ఆయావిభాగాలు తనిఖీ చేస్తున్న కలెక్టర్

సమయపాలన పాటించండి : కలెక్టర్

కలెక్టరేట్‌లో ఆయా విభాగాల తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కలెక్టరేట్‌లో ఆయా విభాగాల సిబ్బంది, ఉద్యోగులు తప్పని సరిగా సమయపాలన పాటించాలని పెండింగ్ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయా విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది వద్దకు వెళ్లి ఆయన మాట్లాడారు. ఆయా విభాగాలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏయే విభాగాలలో ఎవరెవరు పని చేస్తున్నారు సిబ్బంది కొరత ఏమైనా ఉందా అనే వివరాలను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు

జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా పవర్ లిఫ్టర్లు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు. కర్ణాటక రాష్ట్రం దావనగెరెలో జూన్ 22 నుంచి 30 వరకు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో రాష్ట్ర జట్టులో పల్నాడు జిల్లా కు చెందిన క్రీడాకారుడు ఒక బంగారపు, ఒర వెండి, రజిత పతకాలను కైవసం చేసుకున్నారు. ఎన్.శరత్ జాతీయస్థాయి స్వాట్‌లో 303 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సృష్టించాడు. 74 కిలోల విభాగంలో కంకణాలపల్లి చెందిన ఎన్ శరత్ 723 కిలోలు ఎత్తి రజిత పథకం సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ అంతర్జాతీయ క్రీడాకారులైన పసుపులేటి సురేష్ ప్రెసిడెంట్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహూల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, పట్టణానికి చెందిన ప్రముఖులు క్రీడాకారులను అభినందించారు.

అన్నవరం గ్రామంలో మలేరియా ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం అన్నవరం గ్రామంలో బుధవారం మలేరియా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించటం జరిగింది. ఈ ర్యాలీలో "దోమలుకుట్ట రాదు-దోమలు పుట్టరాదు"అని నినాదాలు చేశారు. గ్రామంలోనిమండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, వాటి లక్షణాలు, నివారణా చర్యలు గురించి వివరిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి అల్లం మర్రెడ్డి మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ రెంటచింతల మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి(79) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన గత కొంతకాలగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిగర్వి నిరాడంబరంగా పేరు గాంచిన మర్రెడ్డి 1970 నుంచి 1988 వరకు సర్పంచ్ పదవులు కొనసాగారు. ఆయన పెద్ద కుమారుడు అల్లం ప్రతాపరెడ్డి రెంటచింతల సర్పంచిగా, కోడలు ఇన్న మేరీ జడ్పిటిసిగా పని చేశారు.

సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓ అమలు చేయాలి

జిఓ నెం. ఎంఎస్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి
కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి
సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు సిద్ధం

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సిలార్ మసూద్

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టా రు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్. సిలార్ మసూద్ మాట్లాడుతూ జిఓ ఎంఎస్ నెం 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని 2023 డిసెంబర్‌లో చేపట్టిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 4వతేదీ తర్వాత ఏ క్షణంలో నైనా సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. ఆప్కాస్‌రద్దు చేస్తే ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికుల జీవితాలను అప్పజెప్ప కుండా మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కారుణ్య నియామకాలు, రిటైర్ కార్మికుల పిల్లలకు, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖ అధికారులు మున్సిపల్ శాఖ మంత్రి చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కా రం చేయాలని లేని పక్షంలో సమ్మెబాట పడితామన్నారు. సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు రూ.15వేలు జీతాలు చెల్లించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద బీమా రూ.7లక్షలకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు, రూ.20వేలు మట్టి ఖర్చులకు అందజేయాలన్నారు. అనం తరం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కు వినతి పత్రం అందజేశారు.యూనియన్ ఇంజనీరింగ్ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాబక్షు, నాయకులు సోమ శేఖర్, కిరణ్, జి.సామ్రాజ్యం, వెంకట్, నాగయ్య, కోటేశ్వర రావు, జిలానిమాలిక్, షేక్ గౌస్, సింగ్, బి శ్రీను, సకీలా, శ్రీను, జి వాసు, పి రమేష్, వీర కుమార్, పిట్టా ఏసు, జీవరత్నం, మల్లయ్య, యోహాన్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు పట్టణ కన్వీనర్ జడరాజకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసె లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాలను పరిరక్షించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలనుఅనుమతించవద్దని, మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటి చెల్లించాలని ఆయన కోరారు. 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోను వెంటనే జారీ చేసి అమలు చేయాలనీ, 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, మున్సిపల్ కార్మికులకు జీవోఆర్‌టి నెంబర్ 1516 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం ఆనంద్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పల్నాడు జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు వంగిపరపు చంద్రకళ, బొమ్ము రాజశేఖర్,దుర్గ, వంగిపరుపు శ్రీను, ఇంజనీరింగ్ కార్మికులు కుమారస్వామి, కిరణ్, జానీ, తామస్ పాల్గొన్నారు.

అదనపు పని భారం...ఆర్థిక సమస్యలతో సతమతం

గ్రామ రెవెన్యూ సహాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన

నిరసన తెలుపుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెవెన్యూ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపి గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు షేక్. బందగీ సాహెబ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టామన్నారు. రెవిన్యూ వ్యవస్థలో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా సుదీర్ఘ కాలం నుండి తక్కువ వేతనంతో దిగువ స్థాయిలో పని చేస్తూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. 2018 టిడిపి హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ 6,500 నుండి రూ 10,500 లకు వేతనం పెంచి డిఏ రూ.300లు ఇచ్చారనీ, గత వైసిపి ప్రభుత్వం వీఆర్‌ఏలకు వేతనాలు పెంచకపోగా డిఏ ఉపసంహరించి రికవరీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేతనాలు పెరుగుతాయనీ, అర్హులకు పదోన్నతులు ఇస్తారని ఆశించి భంగ పడ్డారని తెలిపారు. 8 ఏళ్ళ నుండి వేతనాలు పెంచలేదనీ, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పోటీ పడలేక కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నా మన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజులలో యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శిలు సంజీవరావు, సుబ్బారావు, నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు పౌలేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధేలక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఛైర్మన్ మదార్ సాహెబ్, పలువురు కౌన్సిలర్లు భేటీ అయ్యారు. పట్టణ మౌళిక వసతుల కల్పనకై మున్సిపల్ అధికారులు తయారు చేసిన ప్రణాళికలను ఎమ్మెల్యేకు కమిషన్ వేణుబాబు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని ఎమ్మెల్యే ఆరా తీశారు. వీటి నిర్మాణాలకు త్వరగా టెండర్లకు పిలిచి.., పనులు ప్రారంభించాలని సూచించారు. పట్టణ శివారు ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, లైటింగ్ వంటి మౌళిక సదు పాయాలపై నివేదిక తయారు చేసి, వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధికి ఇంకా మరిన్ని గ్రాంట్లు ద్వారా నిధులు రానున్నాయని, ప్రజా సమస్యలను గుర్తించి, పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని ఆయన సూచించారు.

మురుగునీటి నుంచి ప్రజలను కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి

ట్యాంకుల నుంచి వస్తున్న మురికినీరు

పంచాయతీ పైపులైన్లు ద్వారా వస్తున్న మురుగు నీటి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని సిపిఎం అమరా వతి కార్యదర్శి బి.సూరి బాబు అన్నారు. రెండు, మూడు నెలలుగా పంచాయతీ ట్యాంకులు ద్వారా మురుగనీరు వస్తోందని పలువురు మహిళలు ఆందోళన చెందుతున్నారని సూరిబాబు అన్నారు. కృష్ణ నది పక్కనే ఉన్న మంచినీళ్లకు బదులు మురికినీటిని వడపోసుకొని తాగాల్సిన పరిస్థితి వచ్చిందని గృహ వినియోగదారులు పలువురు ఆవేదన చేస్తున్నారు. స్థోమత ఉన్న వారు మిని రల్ నీటిని రూ.10, 15, 30లు పెట్టి కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఉందన్నారు. మేజర్ పంచాయతీ అయినా ఫిల్టర్ బెడ్లు రిపేరు చేయకపోవడంతో మురుగునీరు వస్తోందని సూరిబాబు అన్నారు. పంచాయతీ అధికారులు మండల డెవలప్‌మెంట్ అధికారులు ప్రజా ప్రతినిధులు కలుగ జేసుకొని రిపేర్ చేసి గ్రామ ప్రజలకు మంచినీరు సరఫరా చేయా లని సిపిఎం విజ్ఞప్తి చేస్తోందని అన్నారు. మురుగు నీటిని పసిపిల్లలు తాగడం వల్ల చర్మ వాదులు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేవారు. వెంటనే ఫిల్టర్ బెడ్లు రిపేరు చేసి మంచినీరు అందించాలని కోరారు.

తేళ్ల సుబ్బారావుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బాస్కార్ హాలు వద్ద గల ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోట రాజా రమేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు షేక్ కరీముల్లా, జవ్వాజి మదన్, బండారుపల్లి సత్యం కామినేని సాయి బాబా, గట్టినేని రమేష్, మల్లిబాబు పాల్గొన్నారు.

28న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై జరిగిన పోలీసుల అరాచకాన్ని నిరసిస్తూ జూన్ 28వ తేదీన చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి దళితవాడలో కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తెనాలిలో దళిత మైనార్టీ యువకులపై పోలీసులు అతి దుర్మార్గంగా థర్డ్ డిగ్రీ ఉపయోగించడం అన్యాయం అన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకోవలసిన పోలీసులే బహిరంగ ప్రదేశంలో యువకుల అరికాళ్ళపై లాఠీలు విరిగేలా కొట్టడం చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. విచారణ జరగకుండా ఇలాంటి అమానుష చర్యలు తీసుకోవడం మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని ఆయన అన్నారు. ఈ అమానుష లాటి చార్జ్ చేయడాన్ని నిరసిస్తూ, దళితులపై జరిగే దాడులను ఖండించాలని కోరుతూ జూన్ 28వ తేదీ తెనాలిలో జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సుకు మానవతావాదులు, దళితులు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, నల్లపు లెనిన్, నల్లపు దానియేలు, బిరుదు గడ్డ నరసింహారావు, దార్ల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పల్లె కృష్ణ, ముగ్గురోడ్డులో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

తెనాలి పట్టణంలో పోలీసు అధికారులు నడి బజార్లో దళిత యువకులపై చేసినా అరాచకాన్ని నిరసిస్తూ ఈనెల 28వ తేదీ జరిగే "చలో తెనాలి" కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లి ముగ్గు రోడ్డులో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోమని రాజ్యాంగంలో ఎక్కడ పేర్కొనలేదని చెప్పారు. యువకులు తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం వారు అరెస్ట్ చూపించి కోర్టులు హాజరు పరిచాల తప్ప లాటీలతో బాదే హక్కు పోలీసులకు లేదని చెప్పారు. ఈ దారుణాన్ని చూస్తూ ఊరుకుంటాయి భవిష్యత్తులో మరెన్నో తెనాలి లాంటి ఘటనలను చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దళిత యువకులు కదలివచ్చి పోలీసుల దౌర్జన్యా లను ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్శనపు విజయ్ బాబు, కె.బాబురావు, కేవీపీఎస్ నాయకులు శ్యామ్, నాని, ఏసోబు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

204వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 204వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో కందుకూరి హగ్గయ్య, ఎం.శారద, డి.రమణమ్మ, డి.సువర్ణకుమారి, ఉప్పు కాసమ్మలు కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, కె.స్టీవెన్ ప్రారంభించారు, ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కొందరు స్వార్థపరుల చర్యల వలన సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య 32సంవత్సరాలు అయినా పరిష్కారానికి నోచ్కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది చేసిన పొరపాటు వలన కేసులు పదేళ్ల వెనక పడ్డాయి అని చెప్పారు. కార్యక్రమంలో మండెపూడి ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశరావు, షేక్ ఇస్మాయిల్, షేక్ సుభాని, డి.నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, షేక్ ఆరిఫ్, మహిళలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో షానూన్‌కు కాంస్యం

ప్రజాశక్తి - మంగళగిరి

షానునతో అసోసియేషన్ కార్యదర్శి సంధాని

కర్ణాటక రాష్ట్రంలోని ధావన్‌గిరిలో ఈనెల 22వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఆంధ్రప్రదేశ్ తరఫున గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మదిర షానూన్ 47 కేజీ విభాగంలో పాల్గని కాంస్య పతకం సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటన తెలిపారు. పవర్ లిఫ్టర్ షానూన్‌ని ఆమె కోచ్ ఘట్టమనేని సాయి రేవతిని గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎన్ .వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

పర్యటిస్తున్న కమిషన్ అలీం బాషా

గుడ్ మార్నింగ్ ఉండవల్లి

ప్రజాశక్తి- తాడేపల్లి

బుధవారం ఉదయం ఎంటిఎంసి కమిషనర్ ఎస్.కె.అలీం బాషా గుడ్ మార్నింగ్ ఉండవల్లి కార్యక్రమం నిర్వహించారు. ఉండవల్లి సెంటర్ వంశీ అకాడమీ స్కూల్ ప్రక్క వీధిలో, మరియు బాపనయ్య నగర్‌లో డ్రెయిన్లు, పారిశుధ్యం, రోడ్ల ఆక్రమణలు, వీధిలైట్లు తదితర సమస్యల్ని ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లి మండల టిడిపి అధ్యక్షులు దాసరి కఅష్ణ మునిసిపల్ కమిషనర్ దృష్టికి ప్రజా సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వల్లభాపురం స్వర్ణ శంకర్, యూనిట్ ఇంచార్జిలు దొప్పలపూడి జ్యోతిబసు, గాదె బసివి రెడ్డి, కూనపరెడ్డి రమేష్, యర్రంశెట్టి రాము, వంగా నరేంద్ర, లగుడు మౌనిక, పద్యాల కమలనాభడు, లాం నరేష్, గాదె శ్రీనివాసరావు, గండికోట సోమారావు,సిగిరిశెట్టి లీలా కృష్ణ, మునిసిపల్ అధికారులు, సచివాలయ అధికారులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - తెనాలి

తెనాలిలో పోలీసుల అకృత్యాలను నిరసిస్తూ ఈనెల 28న మానవ హక్కుల పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు సమన్వయకర్త, ప్రముఖ న్యాయవాది పిల్లి విద్యాసాగర్ తెలిపారు. సదస్సు నిర్వహణ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ఐతానగర్ పొట్టి శ్రీరాములు పార్కు కమ్యూనిటీ హాలులో ఈ నెల 28న కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. మానవ హక్కులను హరిస్తూ, పట్టణ త్రీ టౌన్, టూ టౌన్ సిఐలు, సిబ్బంది దళిత, మైనారిటీ యువకులను చిత్రహింసలకు గురిచేశారన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కోర్టు సుమోటోగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల చట్ట వ్యతిరేక చర్యలను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే దుర్మార్గంగా వ్యవహరించి దళిత, మైనారిటీ యువకులను హింసించడం దారుణమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు యంగ్రపాటి అశోక్, కెవిపిఎస్, కెఎన్‌పిఎస్, బార్ అసోసియేషన్, పలు ప్రజా సఘాల నాయకులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణలో విద్యాసాగర్, మాల్యాద్రి, సాంబిరెడ్డి

యువతను బానిసలు చేస్తున్న మాదకద్రవ్యాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాలు యువతను బానిసలు చేస్తున్నాయని తెనాలి ఒకటవ పట్టణ సిఐ మల్లికార్జునరావు అన్నారు. జిల్లా ఎస్పి ఎస్ సతీష్ కుమార్ ఆదేశాలతో తెనాలి పట్టణంలో బుధవారం నో డ్రగ్స్ అంటూ యాంటి డ్రగ్స్ ర్యాలి నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబిఎ) 25 రోజులుగా నిర్వహిస్తున్న యాంటి డ్రగ్స్ ర్యాలీని తెనాలి వివేక జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలసి తెనాలి పురపాలికల్లో నిర్వహించినట్లు ఒకటవ పట్టణ సిఐ వి మల్లికార్జునరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువతరంలో మాదకద్రవ్య వ్యసనాలు తీవ్రమై ఆందోళన కలిగిస్తుందన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాలను ఉపయోగించడం ద్వారా ఆ వ్యక్తికే కాకుండా వారి కుటుంబం, సమాజంపై కూడా ప్రమాదకరమైన పరిమాణాలకు దారితీస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వివేక కళాశాల ఎఓ మురళి, రాంబాబు, బాబురావు, నవీన్, నజీరుద్దీన్, వన్ టౌన్ ఎస్సైలు పాల్గొన్నారు.

నో డ్రగ్స్ ర్యాలీ నిర్వహిస్తున్న వన్ టౌన్ సిఐ వి.మల్లికార్జునరావు

రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రగ్బీ పోటీలకు వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :ఈనెల 28, 29 తేదీలలో కర్నూలు జిల్లాలోని, కర్నూలులో జరిగే రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ 9వ తరగతి విద్యార్థులు సేక్ బాజీ, కె.ప్రియదుర్గ, డి.సాహితీలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బుధవారం నూతక్కి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జిల్లాస్థాయి అండర్ 18 రగ్బీ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఎంపికై పాల్గొన్నారు. మరల కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం మా పాఠశాలకి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణితం ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ఎం.రవి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.రవి, రామచంద్రారెడ్డి, టి.శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన వారిలో ఉన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక జరిగే సమ్మె నోటీసులను బుధవారం ఏఐటీయూసీ, సిఐటియు, వైఎస్సార్‌టియుసి నాయకులు మంగళగిరిలోని పట్నంలోని ఆటోనగర్‌లోని కార్మికవాడలో నోటీసులు అందజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వారు తెలిపారు. జులై 9వ తేదీన జరిగే సమ్మెలో ఆటో రంగంలో పనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, వైఎస్సార్‌టియుసి నాయకులు ఆర్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజే స్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

దేశ వ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ కోరారు. బుధవారం నల్లపాడు యుపిహెచ్‌సిలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, మట్టి ఖర్చులు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు, సాధారణ సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అదేవిధంగా ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం జరిగే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని ఆశా వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తొలుత యూనియన్ నల్లపాడు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా ఎం.నాగమణి, కార్యదర్శిగా టి. ప్రియాంక, సహాయ కార్యదర్శులుగా డి.ప్రమీల, సభ్యులుగా వై.ప్రసన్న, కొండమ్మ ఎన్నికయ్యారు.

సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు, నాయకులు

అవార్డు అందుకుంటున్న గట్టు సరోజిని

గట్టు సరోజినికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్నేహం, సేవా అనే దృక్పథంతో ఇన్నర్‌వీల్ క్లబ్ పని చేస్తోందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. 2024-25 సంవత్సరానికి ఇన్నర్ వీల్ ఆఫ్ చిలకలూరిపేటకు క్లబ్‌కి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, ఎక్సలెంట్ సర్వీసు అవార్డుతో పాటు మొత్తం 24 అవార్డులను అందుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రికగ్నిజేషన్ ఆవార్డ్స్ సెలబ్రేషన్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నామని తెలిపారు. సంవత్సరకాలంగా చేపట్టిన 103 వివిధ సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ, అవార్డులతో పాటుగా ప్రశంసా ప్రతాలనూ అందజేశారన్నారు. క్లబ్ ట్రెజరర్ పి.రమాదేవికి కూడా సెలబ్రేట్ స్టార్ ట్రెజరర్ అవార్డు అందజేశారన్నారు. దాతలు, క్లబ్ సభ్యుల సహకారంతో పలు సేవా కార్య క్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. తనతో పాటు డిస్ట్రిక్ట్ చైర్మన్ కోలా విజయలక్ష్మి, సెక్రటరీ జయలక్ష్మి ఆవార్డుల కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. పలువురు గట్టు సరోజినిని అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మహాలక్ష్మి ట్రిపుల్ ఐటీకి ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరీ పురంలోని భారతరత్న ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్, విద్యార్థిని 2024- 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి 576 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన మూకిరి మహాలక్ష్మి అనే విద్యార్థిని ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో, నూజి వీడు ఐఐఐటీకి సీటు సాధించిందని ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులోనూ కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుని నిర్మించు కోవాలని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పత్తి పంటపై ప్రయోగాత్మక పరిశీలన

ప్రజాశక్తి - దుర్గి

మండలం పొలాల్లో కొత్త రకం కంది పంటపై ప్రయోగాత్మకంగా పరిశీలన చేయనున్నట్లు డాడ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ బుధవారం తెలిపారు. మండలంలోని పొలాలను ఆయన పరిశీలించి తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి ఇచ్చే ఐసిపివి. 254. 44 రకం కంది పంట కొత్తగా ట్రయల్ వేస్తున్నామని ఆయన తెలిపారు. మోడల్‌గా మండలంలోని ఇద్దరు రైతులకు ఇవి శాంపిల్‌గా ఇస్తున్నా మన్నారు. ఒక్కొక్క రైతుకు రెండున్నర ఎకరాలలో కంది పంట పండించేందుకు విత్తనాలు మంజూరు చేస్తున్నామన్నారు. కంది విత్తనాలు 3+1R4 రకాలు కలిసి ఉంటాయని ఆయన తెలిపారు. పత్తి పంట వేసిన రైతుల పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పత్తిలో పచ్చ దోమ నివారణకు కాండానికి బొట్టు పెట్టే పద్ధతిని 20 మిల్లీ లీటర్ల కాండిడార్ మందును 400 మిల్లీలీటర్ల నీటిని కలిపి మొక్క మధ్య భాగంలో బొట్టు పెట్టుకుంటూ వెళ్లాలని రైతులకు సూచించారు. 30,60,90 రోజులకు ఒకసారి పిచికారి చేయాలని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంటర్‌కు ప్రణాళికలు సిద్ధం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు

ప్రజాశక్తి - విపి సౌత్

మండలంలోని ఏడో మైలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. బుధవారం మాచర్ల మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గత సంవత్సరం 10వ తరగతి సాధించిన ఫలితాలను తెలుసుకొని ఉపాధ్యాయులను అభినందించారు. గిరిజన నాయకులు ప్రధానోపాధ్యాయులు దుర్గభవానీ పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయించాలని పదవ తరగతి తర్వాత గిరిజన బాలికలకు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక పోతున్నారని చెప్పడంతో స్పందించిన చైర్మన్ ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తర్వాత బ్రహ్మానందపురం తండాను సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. తండా శివారులోని సేవలాల్ మహారాజ మందిరాన్ని దర్శించి అక్కడి గ్రామస్తులతో సమా వేశమై వారి నుండి వినతులను స్వీకరించారు. అనంతరం పిటిజి స్కూలు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టి కమిషనర్ సాంబయ్య, డిటి డబ్ల్యూ జోత్స్న, ఎమ్మార్వో కిరణ్ కుమార్, గిరిజన సలహా మండలసభ్యులు రావుల కొండలు, జడ్పిటిసి మల్లుస్వామి, పాండునాయక్, నాగేశ్వరరావు నాయక్, చౌదరి, బాలాజీనాయక్ బామల నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకాలకు బిల్లు తప్పనిసరి

వ్యవసాయశాఖ ఎడిఎ జగదీశ్వరరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

బిల్లుపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్మకాలను నిర్వహించాలని వ్యవసాయశాఖ ఎడిఎ వి.జగదీశ్వరరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక శ్రీ కోదండరామాలయంలో బుధవారం ఉదయం ఎడిఎ కార్యాలయ పరిధిలోని ఎరువుల వ్యాపారులకు ఈ-పాస్ మిషన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎడిఎ వి.జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల వ్యాపారులు ఎరువుల విక్రయం చేసిన వెంటనే సదరు వివరాలను ఈ-పాస్‌మిషన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని వ్యాపా

మాట్లాడుతున్న జగదీశ్వరరెడ్డి

రులపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడ వారు కొనుగోలు చేసే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు సరైన వివరాలతో కూడిన బిల్లును వ్యాపారులను అడిగి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు డి పాపకుమారి, వై పుల్లారెడ్డి, టి.బాలాజీ, గంగాధర్, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, గురజాల మండలాల పరిధిలోని వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి - విపి సౌత్

ఎత్తిపోతల శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాయక స్వామి, దత్తాత్రేయ స్వామి వారి (తొలి ఏకాదశి) వేడుకలు, జూలై 6 తేదీన అదే రోజు శ్రీరంగ దత్త అన్న సమారాధన 15వ వార్షికోత్సవం జరగనున్నట్లు సేవా సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి రావాలని కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను బుధవారం ఆయనకు అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ మాచర్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ ఎత్తిపోతల క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు, భజనా

ఎమ్మెల్యేకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

కార్యక్రమాలు, భక్తులకు అల్పాహారం, సుమారు 16 నుంచి 18వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేస్తా మన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ జెడ్పిటిసి ఎస్.గోపిరెడ్డి, పి.చంద్రశేఖరరావు, షరాబు వెంకటరత్నం ఉన్నారు.

పంటలకు సమగ్ర చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రత్తి, ఇతర పంటలు వేసే రైతులు ముందు నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.కృష్ణయ్య కోరారు. బుధవారం మండలంలోని కాశిపాడు, తమ్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ స్వల్పకాలిక పత్తి వేయటం వల్ల గులాబీ రంగు పురుగు దాడి నుండి తప్పించుకోవచ్చునన్నారు.రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల మానవ ఆరోగ్యం కాపాడుకోవచ్చు అన్నారు. పత్తి, మిరప, పసుపు పంటలలో ఎండు తెగులు రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అందుకుగాను ఎకరానికి రెండు నుండి నాలుగు కిలోలు ట్రైకోడెర్మా విరిడిని 90కిలోలు పశువుల ఎరువు, 10కిలోలు వేప పిండితో కలిపి భూమిలో చల్లుకోవాలన్నారు. 200 కిలోలు వేప పిండితో కలిపి వ్యాము, పిఎస్బి, అజోస్ బ్యాక్టీరియా కూడా భూమిలో వేయటం వల్ల నేల సారవంతమై పోషకాలు కూడా అందుతాయని వివరించారు. రైతులందరూ జీవన ఎరువులను విరివిగా వాడటం వల్ల ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. ఏఈఓ శివపార్వతి, వ్యవసాయ సిబ్బంది సాయి, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ - ఆంధ్రలో ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛ-ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని కూటమి శ్రేణులతో కలిసి చీపురు పట్టుకొని క్రీడాప్రాంగణాన్ని శుభ్రం చేశారు. స్టేడియంలోని వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న గడ్డి పిచ్చి, మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు, నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ కట్టుబడి పని చేస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కారంపూడి మండలం, ఒప్పిచర్లకు చెందిన టీడీపీ కార్యకర్త కోట కోటయ్య మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కోటయ్య కుటుంబ సభ్యులకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి ప్రమాద బీమా రూ. 5లక్షల నగదు చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కష్టాలను ఎరిగి, నిత్యం వారి అభ్యున్నతికి పార్టీ అధినేత చంద్రబాబు పరితపిస్తూ ఉంటారని పేర్కొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తను ఆపత్కాలంలో బీమా ద్వారా ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన కుటుంబా లకు పార్టీ ప్రమాద బీమా కొంతమేరకు అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కారంపూడి మండల టీడీపీ నాయకులు, పంగులూరి పుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసిన గోపాల్‌రావు

నూతన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా గోపాల్‌రావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ నూతన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. గోపాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నిన్నటి వరకు పట్టణంలో పని ఎంవిగా పని చేసిన కె.ఎల్. రావు నరసరావుపేట ఆర్‌టిఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన గోపాలరావు గుంటూరు ఆర్‌టిఓ కార్యాలయం నుంచి చిలకలూరిపేట ఆర్‌టిఓ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. గోపాలరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. డ్రైవర్లు యూనిఫామ్ తప్పనిసరిగా వేసుకోవాలనీ, వెహికల్‌కి సంబంధించిన కాగితాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు.

మాదకద్రవ్యాలు లేని సమాజం నిర్మించాలి

ప్రజాశక్తి -మేడికొండూరు

ద్రవ్యాలు లేని సమాజ స్థాపన నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాల్పడాలని మేడికొండూరు సిఐ ఎస్ కె నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. మండలంలోని పేరేచర్ల జంక్షన్లో బుధవారం సాయంత్రం యాంటీ డ్రగ్స్‌పై యువత, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిన్నభిన్నమవుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి యువత మంచి అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు. డ్రగ్స్ అమ్మడం నేరం, కొనడం నేరమని అన్నారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఉన్నతమైన లక్ష్యాలు ధరి చేరాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల విద్యా ర్థులు, విశ్వభారతి ఫార్మసీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు కార్యక్రమం మండలంలోని గణపురం సిఆర్ కళాశాలలో బుధవారం నాదెండ్ల ఎస్సై జి పుల్లారావు నిర్వహించారు విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులు మత్తు పదార్థాలు డ్రగ్స్ మొదలగు వాటికి దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు వినియోగం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు వారి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయని అవగాహన కల్పించారు మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు జూన్ 26వ తేదీన బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

హింసను ప్రేరేపిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

జిల్లా టిడిపి మీడియా కోఆర్డినేటర్ జి.శ్రీనివాస రెడ్డి...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ లబ్ది కోసం హింసను ప్రేరేపించడం, అరాచక శక్తులను ప్రోత్సహించడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఏ మాత్రం తగదని పల్నాడు జిల్లా టిడిపి మీడియా కోఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పర్యటనలలో కార్యకర్తలు ప్రదర్శించిన ప్రకార్డులలో నరికేస్తాం అనే మాటలకు ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. నాయకులంటే ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం పని చేసి ప్రజలకు భరోసా కల్పించి అండగా నిలబడాల న్నారు. ఇటీవలి రెంటపాళ్ళ జగన్ పర్యటనలో వ్యక్తి మృతి చెందినా కనీస మానవత్వం చూపించలేదని మనుషుల ప్రాణం కంటే రాజకీయాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభి వృద్ధికి వైసిపి అడుగడుగునా ఆటంకం కలిగిస్తోందన్నారు. వైసిపి నేతలు అసత్యప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. అసత్య ప్రచారాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి షేక్ సుగున బేగం రైతుల (కౌలురైతుకార్డు) ప్రాముఖ్యతను వివరించారు. కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులు అందరు తమ గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది లేదా వీఆర్ఓను సంప్రదించి కౌలు కార్డును పొందాలని సూచించారు. రైతులు అందరు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకోవాలని తెలియజేసారు. దీని ద్వార రసాయనిక ఎరువుల మీద పెట్టె ఖర్చును కొంత వరకు తగ్గించుకోవచ్చు మరియు భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు. భూ యజమానులు, కౌలు రైతులు కూడా క్రాప్ ఇన్స్యూరెన్స్ చేసుకోవడానికి అర్హులని, క్రాప్ ఇన్స్యూరెన్స్ చేయించుకుంటే తుఫాన్లు, కరువులు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఇఓ చరణ్, వి.ఎ.ఎ.భవాని గ్రామ రైతులు పాల్గొన్నారు.

వట్టిచెరకూరు మండలంలో..

వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు , వింజనంపాడు గ్రామాల్లోలో బుధవారంపొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయధికారి చందోలు సునీత రైతులను అవగాహన కల్పించారు. సాయిల్ హెల్త్ కార్డు గురించి వివరించారు. పచ్చిరొట్ట పంటల వలన ఉపయోగాలు తెలిపారు. పిల్లి పెసర జీలుగా జనము విత్తనాలు 50 శాతం రాయితీ తో రైతులకి ఇవడం జరుగుతుంది అని తెలిపారు. మిరప మరియు ప్రత్తి లో సస్య రక్షణ పద్ధతులు తెలియజేశారు. సేంద్రియ వ్యవసాయం వలన ఉపయోగాలు తెలిపారు. వరి విత్తనాలు కావాల్సిన వారు మీ గ్రామాల్లో రైతు సేవ కేంద్రం లోని వ్యవసాయా అధికారి నీ కలిసి వరి విత్తనాలు తీసుకోవలసినదిగా కోరారు. మండలంలో 300 క్వింటళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి కౌలు రైతు రెవెన్యూ శాఖ ద్వారా ఇచ్చే కౌలు రైతు కార్డును తీసుకోవాలని కోరారు. కౌలు రైతు కార్డు ఉండడం వలన వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలు అన్ని కౌలు రైతుకి వర్తిస్తాయి అని తెలిపారు. వరి, మినుములు, చిల్లీస్ ని ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు.ఈ కార్యకమంలో వీహెచ్ఏలు యశోద, సిరాజ్, రైతులు పాల్గొన్నారు.

కొర్నెపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి చందోలు సునీత, ఉప్పలపాడులో అవగాహన కల్పిస్తున్న ఏవో సుబ్రహ్మణ్యం

పెదనందిపాడు మండలంలో..

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని ఉప్పలపాడు మరియు అన్నవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం నిర్వహించారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో వేసుకునే పత్తి, అపరాలు మొదలైన పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా హెచ్డి బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోకపోతే ఖచ్చితంగా వారు యాప్ నందు వారి వివరాలను విఏఏ దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం రైతు సోదరులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు జన్న, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఏఏలు జోత్స్న, పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఛైర్మన్ సాంబశివరావు

అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ రెండేళ్లుగా నిర్విరామంగా ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా 40 మంది దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, ఖగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నా రాయణ, మారం మల్లికార్జునరావు, కోరాడ శ్రీనివాసరావు, ఉద్దంటి మురహరిరావు, డోగిపర్తి శ్రీహరిరావు పాల్గొన్నారు.

గొర్రెల, మేకలకు నట్టల నివారణ కార్యక్రమం

ప్రజాశక్తి - తాడికొండ

గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని నేటి నుండి జులై 10వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏ.డి. వై.రాయపరెడ్డి బుధవారం తెలిపారు. మండల పరిధి లోని ఆయా గ్రామాలలో ఉన్న పశు వైద్యశాలలో నట్టాల నివారణకు ఉచితంగా మందులు వేయబడతాయని తెలిపారు. నట్టల నివారణతో గొర్రెలు ,మేకలు, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని తెలియజేశారు. పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ శ్రీనివాసరావు

డివిజనల్ పంచాయతీ అధికారి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని ఉప్పలపాడు పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ త్వరలో డిప్యూటీ కమిషనర్ మండలంలోని గ్రామా పంచాయతీలను సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలిస్తానని, పంచాయతీ అధికారులు తమ రికార్డులను ఎప్పటికీ అప్పుడు అప్డేట్ చేయాలన్నారు.

ఫ్రీ స్కూలుకు పరుపులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మున్సిపాలిటీ సెక్టార్ - 1 శాలివాహన నగర్లో గల ప్రీ స్కూల్ పిల్లలు భోజన విరామం తర్వాత కొద్దిసేపు పడుకోవటానికి మూడు పరుపులు ప్రీ స్కూల్ తల్లిదండ్రులు మంచా కుమార్ - మానస వాళ్ళ బాబు మంచా ఈశ్వర్ పేరు మీద అంగన్‌వాడీ స్కూల్‌కి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్ వైజర్ వి.శ్రీదేవి అంగన్వాడీ కార్యకర్త అందె సునీత, యు కళ్యాణి, సీత, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్యక్షులు పరంజ్యోతిని అభినందిస్తున్న సురేష్ కుమార్, జాన్ పాల్

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తెనాలి

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐతానగర్ పాడిసన్ పేట బిషప్ గడ్డం థామస్ ప్రాంగణంలో సభ ఏర్పాటు చేశారు. సభకు పట్టణ వ్యాప్తంగా ఉన్న 150 మంది సంఘ కాపరులు హాజరయ్యారు. రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిధులుగా బిషప్ కత్తెర సురేష్ కుమార్, బిషప్ జాన్ పాల్, ఆత్మీయ అతిథులుగా బిషప్ గడ్డం జూనియర్ సాధు థామస్, బిషప్ పాముల పరంజ్యోతి, బిషప్ సువర్ణ రాజులు హాజరయ్యారు. తొలుత సభలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా బిషప్ కత్తెర సురేష్ కుమార్, అధ్యక్షులుగా బిషప్ పాముల పరంజ్యోతి, వ్యవస్థాపక అధ్యక్షులుగా బిషప్ పినపాటి జాన్ పాల్, ప్రధాన కార్యదర్శిగా బిషప్ సువర్ణ రాజు, కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి (పాట్) జాయింట్ సెక్రటరీ రెవ.రావూరి విక్టర్ పాల్, వర్కింగ్ సెక్రటరీ రెవ. మల్లవరపు విజయ్ కుమార్, ట్రెజరర్ రెవ.విలియం కేరీ, జాయింట్ ట్రెజరర్ రెవ. అన్నం ఆదాము, మెంబెర్స్ రెవ. గడ్డం జాన్ బాబు, పాస్టర్ షడ్రక్ , రెవ.భాగ్యరాజు, రెవ.జాన్ వర ప్రసాద్, మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగ రాజు, పెద్ద ఎత్తున దైవ సేవకులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి చేబ్రోలు

ఆగిన పాఠశాల అభివృద్ధి పనులు తిరిగి చేపట్టాలని స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌కి నారాకోడూరు జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సంబంధింత అధికారులను ఆదేశిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు మాట్లాడుతూ మనబడి మన భవిష్యత్‌లో భాగంగా అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణపనులు, ఎలక్ట్రిఫికేషన్, సబంధిత సమస్యల గురించి విన్నవించినట్లు తెలిపారు. అలాగు అదనపు గదుల నిర్మాణం కూడా ఆగిపోయిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనులు ఇలా ఆగిపోవడంతె మంచి ఉపాధ్యాయ బృందం ఉన్నప్పటికీ పూర్తికాని గదులు నిర్మాణం, ఎలక్ట్రీషియన్ వంటి సమస్యలతో నాణ్యమైన విద్యా బోధన విద్యార్థులకు అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన పనులకు సంబంధించి పాఠశాలలో అకౌంట్లో ఉన్న నిధులను ఉపయోగించి ఎలక్ట్రిఫికేషన్ చేయించుటకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఎస్‌పిడి కి వినతి పత్రము ఇచ్చినట్లు తెలిపారు.

లైసెన్స్ డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనాలి

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు, గోళ్లమూడి గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్ సమక్షంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది.ఈ సందర్భముగా రమణ కుమార్ రైతులకు కొన్ని సూచనలు చేసినారు. ముఖ్యంగా విత్తనాలు లైసెన్స్ కలిగిన డీలర్స్ వద్ద మాత్రమే కొనాలని, తప్పనిసరిగా కొన్న విత్తనాలకు బిల్లులు తీసుకొని పంట కాలం మొత్తం దాచి పెట్టుకోవాలని అలానే ఆ విత్తన సంచులను కూడా దాచుకోవాలి మరియు పురుగు మందుల వాడకంలో తీసుకోవలసిన జాగర్తలు గురించి చెప్పినారు.దళారుల మాటలు నమ్మి నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గోళ్లమూడి ఉప సర్పంచ్ బలరాం, ఏఈఓ శివరాం, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్

రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు

రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కె.శ్రీనివాస శర్మ హెచ్చరించారు. మండలంలో ప్రభుత్వ చౌక దారు (ఫెయిర్ ప్రైస్ షాపు) దుకాణం డీలర్ల మసాంతపు సమావేశం బుధవారం నిర్వహించారు తహశీల్దార్ శ్రీనివాస శర్మ మాట్లాడుతూ సమావేశంలో 65 సంవత్సరాలు పైబడిన కార్డు దారులకి నిత్యావసర వస్తువుల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇవ్వాలన్నారు. ఇంటికి వెళ్లి రేషన్ అందించే పంపిణీ కార్యక్రమం ప్రతి నెల 26 నుంచి 30 తేదీ వరకు డీలర్లు విధిగా నిర్వర్తించాలని ఆదేశించారు. మిగిలిన కార్డు దారులకు ప్రతి నెలా 1వ తారీఖు నుంచి 15 వ తారీఖు వరకు దుకాణం తెరిచి ఉంచి రేషన్ పంపిణీ చేయాలని అన్నారు. పిడిఎస్ రైస్ విషయంలో ఎవరు ఎటువంటి అక్రమాలకు పాల్గొనకూడదని హెచ్చరించారు. ప్రతి డీలరు తప్పనిసరిగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, అన్ని రేషన్ షాపులను తనిఖీలు చేస్తామని, లైసెన్సులు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. అక్రమాలు, అవకతకలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా ఈ కె వై.సి పూర్తి కానీ కార్డు దారులు ఉంటే వెంటనే చేయించాలని సూచించారు . ఈ కార్యక్రమము లో కార్యాలయపు డిటి శ్రీనివాస రావు , సిఎస్‌డిటి వెంకట్రావు, డీలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాస శర్మ

అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది

ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి అప్పుల్లో ముంచేసిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతుందని, వ్యవస్థలను నాశనం చేసిన మీరు మాట్లాడటం సిగ్గుచేటని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం మంగళగిరి నియోజకవర్గ జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. మీడియా సమావేశంలో ఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేసిన అభి వృద్ధి ఏమిటో కళ్లకు కట్టినట్లు కనబ డుతుందని వారన్నారు. 24 ఎన్నికల ముందు కొల్లేరులో 600 ఎకరాల కొల్లేరు భూమిని కబ్జా చేసిన పేర్ని నాని అప్పటి జిల్లా కలెక్టరును బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశాడు. తన అక్రమాలకు వంతపాడని వారిని తప్పించాలనే పేర్ని నాని తన భార్య పేరు మీద గోదాము తీసుకొని పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఘనుడు. రకరకాల ఎత్తులు వేసి తప్పించుకోవడానికి ప్రయత్నించారని వారు అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజి

కోర్టులో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎన్.హనిమి రెడ్డి విద్యార్హతల తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఉద్యోగంలో చేరాడు. సర్టిఫికెట్లను పోలీసు విచారణకు పంపగా హనిమిరెడ్డి ఇంటర్ పాస్ అయినట్టు నిర్ధారణ అయింది. ఈ ఉద్యోగానికి ఏడో తరగతి పాస్ అయి ఉండాలి లేదా ఇంటర్ ఫెయిల్ అయినా అయి ఉండాలి. కానీ ఇతను ఇంటర్ పాస్ అయినా ఫెయిల్ అయినట్టు దరఖాస్తులో పేర్కొనగా విచారణలో అసలు విషయం బయటపడటంతో అతన్ని సస్పెండ్ చేశారు. నరసరావుపేటలోని 13వ అదనపు జిల్లా కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా పనిచేస్తున్న పి.వెంకట్రావును ఒక మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదులు రావడంతో ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థులకు రాష్ట్రపతి అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

రిషబ్ ఓస్వాల్‌ను అభినందిస్తున్న రాష్ట్రపతి

సిఎంఎ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు రిషబ్ ఓస్వాల్ , కొత్తపేట తేజశ్విని మంగళవారం న్యూఢిల్లీలోని విగ్యాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా సన్మానించారు. వివిధ కామర్స్ కోర్సులలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 55 ఫస్ట్ ర్యాంకులు సాధించారని, కానీ ఈసారి ఫైనల్ లెవల్‌లో ఇద్దరు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు రావటం చాలా అరుదైన సంఘటన అని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

మొదటి ర్యాంకర్‌ను అభినందిస్తున్న వైవి ఆంజనేయులు

పిజిఈసెట్ ఫలితాలలో చలపతి విద్యార్థినికి మొదటి ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన పిజిఈసెట్ ఫలితాలలో చలపతి ఫార్మసీ కాలేజి విద్యార్థిని ఎ.ఉమామహేశ్వరి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. అంతే కాకుండా హాజరైన 32 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అలాగే తమ విద్యార్థులు జి.తనూజ భాగ్యశ్రీ 7వ ర్యాంకు, సిహెచ్.వీరమోహన్‌రెడ్డి 25వ ర్యాంకు, డి.వేలంగినిరాణి 42వ ర్యాంకు, కె.సాయిలక్ష్మి 64వ ర్యాంకు, బి.తనూజ 99వ ర్యాంకు సాధించారన్నారు. వెయ్యిలోపు 22 మంది ర్యాంకులు సాధించారన్నారు. పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టి, కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల సెంటర్ ద్వారా విద్యుర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధ్యయన లక్ష్యాలను దష్టిలో ఉంచుకొని, సమగ్రమైన సిలబస్ కవర్ చేస్తూ విద్యార్థులను మార్గనిర్దేశనం చేస్తున్నారు. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల అధినేత వైవి ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సహకాలు అందచేస్తున్న మేయర్

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి-గుంటూరు: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. విద్యాశాఖలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం నగరంలోని పట్టాభిపురం మున్సిపల్ కార్పోరేషన్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో 500లకి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రోత్సహకాలు అందించే కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 10 వ తరగతిలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సదరు పాఠశాల పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని అందించటం అభినందనీయం అన్నారు. అభినందనీయమని తెలియచేశారు. అలాగే 10వ తరగతి పూర్తిచేసి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన హాసినిని మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, పూర్వవిద్యార్థులు చావాలి గణపతి, కామేశ్వరరావు, రఘుకుమార్, పతంజలి, కృష్ణశాస్త్రి, నరహరి, హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీలలో భారత్ పురోభివృద్ధి

సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్, కృత్రిమ మేధస్సు పురోగతిని రష్యన్లకు పరిచయం చేయటం ఆనందంగా ఉందని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. రష్యా రాజధాని మాస్కోలో నాలుగు రోజుల పాటు జరిగిన యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం ప్రదర్శనలో పాల్గొని వచ్చిన డాక్టర్ నరేంద్రరెడ్డి మంగళవారం స్థానిక అరండల్‌పేట లోని సాయిభాస్కర్ హాస్పిటల్‌లో అక్కడి అనుభవాలను విలేకరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్రమోడీ ఆర్థోపెడిక్ విభాగంలో రోబోటిక్‌ల వినియోగం పెంచాలని సూచిస్తూ పలు రోబోటిక్‌లను ప్రారంభించటం జరిగిందన్నారు. దానికి అనుగుణంగానే రష్యాలో జరిగిన ఈప్రదర్శనలో భారత్‌లో ఆర్థోపెడిక్ రంగంలో రోబోటిక్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వినియోగాన్ని, అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రష్యన్ సర్జన్లకు వివరించటం కొత్త అనుభూతి మిగిల్చిందన్నారు.

రోబోటిక్ సర్జరీ గురించి వివరిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

జాయింట్ రీప్లేస్‌మెం ట్‌లో రోబోటిక్ వాడకంపై రష్యన్ సర్జన్లు ప్రత్యేక ఆసక్తి కనబరిచారని వివరించారు. రష్యాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నప్పటికీ సమావేశాలకు దాదాపుగా 500 మందికిపైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరయ్యారని తెలిపారు. భారత్‌లో జరుగుతున్న మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్ పాత్ర, అనుభవాలను అక్కడికి వారికి వివరించి నట్లు డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు.

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను విభజించి పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచి, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకుండా అన్యాయం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినప్పటికీ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని, మున్సిపల్ శాఖ మంత్రి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డిఎంఎలను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ ఇంతవరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచకుండా అన్యాయం చేస్తుంది అన్నారు. ప్రమాదకరమైన పనులు చేస్తున్న ఇంజినీరింగ్

జిఎంసి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని గత ఏడుసంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా కనీసం స్పందించలేదని అన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచి ఇవ్వాలని కోరుతూ జూలై 4వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలియజేశారు. ఆ తరువాత ప్రజలకు జరిగే అసౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు షేక్ బాషా, రసూల్, షమ్మీ, నరసింహారావు, పవన్, కుమార్, కంచర్ల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఏడాది పాలన పూర్తయినా వీఆర్ఏల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, సమస్యల పరిష్కరించకుంటే పోరుబాటే మార్గం అని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు అన్నారు. విఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన పేరుతో పెద్ద ఎత్తున సభలు జరుగుతూ ఉత్సవాలు చేసుకుంటున్నారని, కానీ ఏడాది పాలనలో వీఆర్ఏలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు నారాలోకేష్ యువగళం పాదయాత్రలో విఆర్ఎలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, గత ప్రభుత్వం మీ సమస్యలు పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ ఆ హామీలు అమలు కాలేదన్నారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం వీఆర్ఏలు అందరికీ పేస్కేలు అమలు జరుపుతూ పేస్కేలు వేతనాలు ఇస్తున్నాయని, ఇక్కడ ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా ఎందుకు ఆలోచించట్లేదని ప్రశ్నించారు. వీఆర్ఏలకు గతంలో డిఏను వేతనంతో

డిఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఎలు

కలిపి ఇచ్చే వారని, ఇప్పుడు వేరుగా ఇవ్వటం వల్ల వేతనంలో ఎటువంటి పెరుగుదల ఉండట్లేదన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి వేతనాలు పెంపు లేని కారణంగా తీవ్రమైనటువంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విఆర్ఎలు పనిచేస్తున్నారని, వారి సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. నామినేలుగా ఉన్న వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించాలని, ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, వాచ్మెన్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బి. సాంబశివరావు, షేక్ కరీమున్నిసా, షేక్ ఆదంషఫీ, ఎన్.రామారావు, హనుమంతరావు, ప్రతాప్, పాండు, రాజేష్, రవి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతు ఆత్మహత్య యత్నం

ప్రజాశక్తి-గుంటూరు

రైతును పరామర్శిస్తున్న నాయకులు

రాష్ట్ర సచివాలయం ముందు సోమవారం ఆత్మహత్య యత్నం చేసి, జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న నంద్యాల జిల్లాకు చెందిన మంగలి రామకృష్ణను రైతు సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్ మాట్లాడుతూ పొగాకు కొనుగోలు లేక, ఇతర పంటలకు ధరలు లేక అప్పులతో బాధ తట్టుకోలేక రామకృష్ణ ఆత్మహత్య యత్నం చేశాడన్నారు. గత నాలుగేళ్ల నుండి మూడు రకాల పంటలు సాగు చేస్తూ చేతికొచ్చిన పంటలకు ధరలు లేక అప్పుల పాలయ్యాడని, తనకున్న రెండెకరాలు అమ్మి అప్పులు తీర్చడానికి ప్రయత్నం చేసినా ఇంకా అప్పులు ఉండటంతో ఆత్మహత్యా యత్నం చేశాడన్నారు. ఈఏడాది పొగాకు 20 ఎకరాలు, ఇతర పంటలు కూడా కౌలుకు తీసుకొని సాగు చేశాడన్నారు. కొంత పొగాకు తక్కువ రేటుకు అమ్ముకోగా, మిగిలిన 40 క్వింటాలు పొగాకు కొనుగోలు చేయడానికి ఏ కంపెనీలు, ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో అప్పుల బాధతో రెండు సార్లు సిఎం దృష్టికి, వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవించుకున్నా ఫలితం లేకపోవటంతో చివరగా ఈనెల 23న లోకేష్‌ను కలవడానికి ఆయన నివాసం వద్దకు వెళ్లగా, అందుబాటులో లేకపోవడం, రాష్ట్ర సచివాలయం వద్దకు వెళ్లినా అక్కడ కలవడానికి అవకాశం లేదన్న బాధతో తన వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగాడన్నారు. రైతు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారన్నారు. ప్రభుత్వం సకాలంలో పొగాకు కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రైతును పరామర్శించిన వారిలో రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు. అనేక ఆందోళనల తర్వాత బాపట్ల, గుంటూరు జిల్లాలో మొక్కు బడిగా మాత్రమే కొనుగోలు జరుగుతుందని అన్నారు. నల్లబర్లీకి రూ. 12వేలు ధర ప్రకటించి, రూ. 6వేలు, రూ. 7వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో రైతులు ఆ ధరకు విక్రయించటానికి ముందుకు రావట్లేదన్నారు. మరోవైపు రైతులు వారి పంటను దాచుకునే సదుపాయం లేక, వర్షాల భయంతో అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం రూ.250 కోట్లు ఖర్చు చేశామని చెబుతుందని, కానీ 15 శాతమే కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్క సరి కాదన్నారు. అవసరం అయితే పంట మొత్తం కొనుగోలుకు వెయ్యి కోట్లు కేటాయించి పంట మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు.